విలేకరులు కావలెను
మెదక్ టుడే తెలుగు దినపత్రిక,జ్వాల తెలుగు న్యూస్ చానల్‌లో పనిచేయుటకు,తెలంగాణ, ఏపీలో నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
సి.హెచ్ శివ కుమార్
9494117870,
9553335493

RNI NO,TELTEL/2023/88524

# మెదక్ టుడే

తెలుగు దినపత్రిక MEDAK TODAY

బుధవారం, నవంబర్ 27 2024 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 51


## రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

- సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలుగా నమోదు



హైదరాబాద్,నవంబర్26: తెలంగాణలో రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి ఎకువగా ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఇక ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలుచోట్ల ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 9.3 డిగ్రీలు నమోదయింది. అదేవిధంగా న్యాల్కల్‌లో 9.6 డిగ్రీలు, గుమ్మడిదలలో 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇక మెదక్ జిల్లా శివ్వంపేటలో 10 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.2 డిగ్రీలు నమోదయింది.

వివరాలు 2లో



ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు : రాహుల్



న్యూఢిల్లీ,నవంబర్26: ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ ఇవ్వగలనని అన్నారు. ఒకవేళ ఆయన ఈ పుస్తకాన్ని చదివి ఉంటే, ప్రతి రోజు ఇలాంటి పనులు చేసేవాడు కాదు అని రాహుల్ అన్నారు. సంవిధాన్ రక్షక్ అభియాన్‌లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసిందని, కులగణన అనేది సమాజానికి మెగా హెల్త్ చెకప్ లాంటిందని ఆయన అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేది గాంధీ కుటుంబం మాత్రమే అని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

- త్వరగా మూడింటి అభివృద్ధికి చర్యలు
- కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సిఎం చర్యలు
- త్వరగా పూర్తి చేస్తామని హామీ



న్యూఢిల్లీ,నవంబర్26: రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు.

వివరాలు 2లో

## నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు




న్యూఢిల్లీ, నవంబర్ 26 : ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యాణా రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈసీ రిలీజ్ చేసిన షెడ్యూల్ ప్రకారం.. డిసెంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. డిసెంబర్ 10ని నామినేషన్లకు చివరి తేదీగా నిర్ణయించారు. డిసెంబర్ 11న నామినేషన్ల పరిశీలన, 13వ తేదీ నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. డిసెంబర్ 20వ తేదీన పోలింగ్ ఉంటుంది. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, ఏపీలో మోపిదేవి వెంకటరమణా రావు, బీదమస్తాన్‌రావు, ఆర్.కృష్ణయ్య రాజీనామాలతో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయిన విషయం తెలిసిందే.




- కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం
- రాహుల్ మాట మేరకు తెలంగాణలో విజయవంతం
- ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో సిఎం రేవంత్

## ఇచ్చిన మాట ప్రకారం కులగణన

న్యూఢిల్లీ,నవంబర్26: తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభి యాన్ కార్య క్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. రైతుల తరఫున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది.

వివరాలు 2లో

## జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వ్యవహారం కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులదే పాపం

### మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



/హైదరాబాద్,నవంబర్26: జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాచాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. 7 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరంగా ఉన్నాయని వాపోయారు. ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారని ఆక్షేపించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వారి వృత్తిలో కొనసాగకుండా

వివరాలు 2లో

## ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం

- రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదే
- ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతది
- మీటింగులలో కేసీఆర్‌ను తిట్టటమే సిఎం పని
- దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు..
- ప్రజల దగ్గరకు పోతే జనాలు సీఎంను ఛీ కొట్టే పరిస్థితి
- కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది
- నేరెళ్ల బాధితులకు న్యాయం చేశాం..
- కేసీఆర్ మాత్రమే తెలంగాణ మనిషి
- సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో కేటీఆర్



సిరిసిల్ల, నవంబర్ 26: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే బీఆర్ఎస్ భారీ విజయం సాధించడం ఖాయమని కేటీఆర్ అన్నారు. సిరిసిల్లలో దీక్షాదివస్ సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సీఎం పదవి తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిదేననని.. ఢిల్లీవాళ్లకు కోపం వస్తే ఆయన పదవి ఊడుతదన్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని.. కానీ నాలుగేళ్లు వేచి చూడాల్సిందేనన్నారు. సిరిసిల్లలో ప్రజలు ఛీ కొట్టిన సరే అధికారులను అడ్డం పెట్టుకొని ఎగురుతున్న కాంగ్రెస్ సన్నాసులను గుర్తుపెట్టుకుంటామన్నారు. మొన్న సీఎం వేములవాడకు

వివరాలు 2లో

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
బుధవారం, నవంబర్ 27 2024

## రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత

(మొదటి పేజీ తరువాయి)

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రికార్డయిన విషయం తెలిసిందే. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

## రెండో దశలో ఆరు కారిడార్లతో 116.4 కి.మీ ప్లాన్

### - మెట్రో విస్తరణపై సిఎంతో చర్చించామన్న ఎన్‌విఎస్ రెడ్డి

/హైదరాబాద్,నవంబర్26: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో హైదరాబాద్ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తోందని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. మెట్రో రైలు ఏడేళ్లు పూర్తిచేసుకుందని.. ఇది నగర వాసులకే కాకుండా తెలంగాణకు గర్వకారణమని చెప్పారు.'మెట్రో రైలు మొదటి దశ నిర్మాణం సమయంలో నా దిష్టి బొమ్మలు దహనం చేశారు. అలా చేసినవాళ్లే నేడు పూలదండలతో సత్కరిస్తున్నారు. ముంబయి, చెన్నైలో భారీగా ఖర్చు చేసి మెట్రో విస్తరిస్తున్నారు. దురదృష్టవశాత్తు మన నగరంలో విస్తరణ లేకపోవడం వల్ల మూడో స్థానంలో ఉన్నాం. విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించాం. మొత్తం మూడు కారిడార్లు విమానాశ్రయానికి కలిపేలా రెండో దశ ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రెండో దశలో ఆరు కారిడార్లతో 116.4 కి.మీ ప్లాన్ చేశాం. ప్రస్తుతం ఐదు కారిడార్లకు డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపించాం. మేడ్చల్ వైపు కారిడార్ కోసం డిమాండ్లు వస్తున్నాయి. మెట్రో రైలు కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు పెట్టింది. రెండో దశ పూర్తయితే మరింత పురోగతి సాధిస్తాం' అని ఎన్వీఎస్ రెడ్డి అన్నారు.

## పరామర్శించటానికి వెళ్తే అడ్డుకుంటారా : ఎమ్మెల్సీ కవిత

### - నియంత పోకడలకు నిదర్శనం సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,నవంబర్26: ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఫుడ్ పాయిజన్‌తో మరణించిన గిరిజన పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్‌ను అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ దినోత్సవం నాడే రాజ్యాంగ హక్కులకు రేవంత్ ప్రభుత్వం తూర్పార పొడస్తోందని విమర్శించారు. నియంతృత్వ పోకడలకు రేవంత్ రెడ్డి సర్కార్ నిదర్శనమని అన్నారు. ఫుడ్ పాయిజన్‌తో మరణించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ స్వగ్రామం బాదాలో పోలీసులు భారీగా మోహరించారు. శైలజ మృతదేహం ఆసిఫాబాద్ జిల్లా బాదా గ్రామానికి చేరుకున్నది. దీంతో ఆమె బంధువుల, గ్రామస్తులు అంబులెన్స్‌ను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆమె డెడ్‌బాడీని అందులోని నుంచి దించకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అడుగడుగునా మోహరించారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు.అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ౖ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వ్యవహారం... కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులదే పాపం

(మొదటి పేజీ తరువాయి)

అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని బండి సంజయ్ గుర్తుచేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య ఫలితమే నేటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు పాల్జేయడమే కాకుండా చేతికి వస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేశాయి. జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టులు చేసిన తప్పేమిటి. ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష. పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అ÷-దదె కట్టలేక, పిల్లల ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయి' అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.'ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలి. అలాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధం. అలాగాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. జర్నలిస్టులతో కలిసి మహోద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టిస్తాం. అదే సమయంలో జర్నలిస్టులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని జేఎన్జే హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులతోపాటు రాష్ట్రంలోని అర్హులైన విలేకరులందరికీ ఇండ్లను కేటాయిస్తాం' అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ భారీ విజయం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

మంచి మాటలు చెబుతాడనుకున్నానన్నారు. బాలల దినోత్సవమైనా, రాజీవ్ సద్భావన యాత్ర అయినా, ఆయన పుట్టిన రోజు అయినా.. వేములవాడలో మీటింగ్ అయినా సరే కేసీఆర్‌ను తిట్టటమే పని అని.. దేవుళ్ల మీద ఒట్లు, హామీలకు తూట్లు, కేసీఆర్‌పై తిట్లు ఇవి తప్ప నువ్వేం పీకినవ్ అంటూ మండిపడ్డారు. ప్రజల దగ్గరకు పోతే జనాలను సీఎంను ఛీ కొట్టే పరిస్థితి ఉందన్నారు. కొడంగల్‌లో రైతులకు దగ్గరకు వెళ్లలేని పరిస్థితి రేవంత్‌ది అంటూ విమర్శించారు.నేరెళ్లలో ఒక సంఘటన జరిగిందని.. బాధితులకు న్యాయం చేసేందుకు తాను ప్రయత్నం చేశానన్నారు. వాళ్లను కలిశానని.. వీలైనంత వరకు సాయం చేశానన్నారు. మీరు రాజకీయం చేసే ప్రయత్నం చేశారని.. నెరెళ్ల ప్రజలంతా మొన్నటి ఎన్నికల్లో మాకే అత్యధిక ఓట్లు వేశారన్నారు. ప్రజాస్వామ్యంలో పాలకులు అంటే ప్రజలతో తిట్లు తిన్నా సరే వారి మనసు గెలుచుకునే ప్రయత్నం చేయాలంటూ చురకలంటించారు. కొడంగల్‌లో రైతులు ఏం అడిగారు.. తమ భూములకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని కోరారన్నారు. తొమ్మిది నెలలుగా నిరసన చేస్తున్నారని.. ధర్నాలు చేస్తున్నారన్నారు. అయినా వాళ్లకు సీఎం సమయం ఇవ్వలేదన్నారు. సీఎం తమ్ముడు, మంత్రులు ఎవ్వరూ వాళ్లు బతిమాలినా పట్టించుకోలేదన్నారు. ఆఖరికి కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణకు వెళితే నిరసన తెలిపారని.. అదే రేవంత్ రెడ్డి పోయి ఉంటే ఉరికించి.. ఉరికించి కొట్టేవారన్నారు. సీఎం కేవలం అదానీ, తన అన్న, అల్లుడు, బావమరిదికి అమృతం పంచేందుకు మాత్రమే పని చేస్తున్నాడని.. ప్రజల కోసం ఏమీ చేయలేదంటూ మండిపడ్డారు. 28 సార్లు ఢిల్లీకి పోయిండని.. ఫ్లైట్ ఛార్జీలు వృథా తప్ప 28 రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. ఎనిమిది 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారని.. వారంతా 8 రూపాయల నిధులు లేదన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న పనులను గమనిస్తున్నారన్నారు.హైదరాబాద్‌లో ఓ ఆటో డ్రైవర్‌తో మాట్లాడితే ఈ ప్రభుత్వం పోయేందుకు ఏదైనా ఉపాయం లేదా అడుగుతున్నాడన్నారు. ఒకసారి ఓటు వేస్తే ఐదేళ్లు శిక్ష పడాల్నా అంటున్నాడని.. తప్పదు మరో నాలుగేళ్లు వీళ్లు పీక్క తింటూనే ఉంటారన్నారు. ఈ ముఖ్యమంత్రికి కనీస అవగాహన, పరిజ్ఞానం కూడా లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిరిసిల్లలో నేతన్నలు ఉన్నారని.. మరి ఇక్కడ పెట్టాల్సిన నూలు డిపోను తీసుకొని పోయి వేములవాడలో పెట్టిండంటూ ప్రశ్నించారు. గుండుకు దెబ్బ తాకితే మోకాలి మందు పెట్టినట్లుగా ఉందన్నారు. ఇంతా తెలివైన వాళ్లు ఉండటం మన అదృష్టమన్నారు. ఏడాది పాలనలో ముఖ్యమంత్రిని ప్రజలు ఇన్ని తిట్లు తిట్టటం నేను ఎప్పుడు చూడలేదన్నారు. మీడియా, యూట్యూబ్ వాళ్లు మైక్ పెడితే చాలు ఏమాత్రం సంకోచించకుండా రేవంత్ రెడ్డిని పొట్టు పొట్టు తిడుతున్నారన్నారు. ఆ తిట్లు విన్నాక రోషం ఉన్నోడైతే బిల్డింగ్ మీది నుంచి దూకి చస్తాడన్నారు. కానీ, రేవంత్ రెడ్డి కాబట్టి నడిచిపోతోందన్నారు. ఏడాదిలోపే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత ఊహించలేదన్నారు. తెలంగాణ మీద గులాబీ జెండాకు ఉన్న ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉండదని.. కేసీఆర్ మాత్రమే తెలంగాణ మట్టి మనిషి అవుతాడని.. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీ మనుషులేనన్నారు. మన నాయకుడి పోరాటం, తెలంగాణ విద్యార్థుల బలిదానాన్ని దీక్షా దివస్ సందర్భంగా మరోసారి గుర్తు చేసుకోవాల్సి ఉందన్నారు. ఆనాడు తెలంగాణ ఇయ్యాక తప్పని పరిస్థితిని తీసుకొచ్చింది కేసీఆర్ అని.. నవంబర్ 29, 2009 నాడు కేసీఆర్ అనే ఒక్క మనిషి, ఉక్కు సంకల్పంతో చేపట్టిన దీక్ష కారణంగానే తెలంగాణ సాధ్యమైందని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటైన జూన్ 2వ తేదీ ఎంత ముఖ్యమో.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కీలక మలుపు అయిన దీక్షా దివస్ నవంబర్ 29 అంతే ముఖ్యమన్నారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వ తేదీ వరకు పదకొండు రోజులు జరిగిన దీక్ష కారణంగా అనివార్యంగా తెలంగాణ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. ఏ రోజైతే తెలంగాణ ప్రకటన వచ్చిందో అదే డిసెంబర్ 9వ తేదీని విజయ దివస్‌గా జరుపుకుందామన్నారు. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరికలు జారీ చేశారు. బీఆర్ఎస్ నాయకులను పార్టీ మారాలని చెబుతున్నారట అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రాజ్యాంగ దినోత్సవమని.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ఆర్టికల్-3 ద్వారానే తెలంగాణ సాధ్యమైందన్నారు. అందుకే తెలంగాణ ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటారన్నారు. ఆయన చూపిన బాటలోనే బోధించు, పోరాడు, సమీకరించు అన్న విధానంలోనే కేసీఆర్ పోరాటం చేసి తెలంగాణ సాధించారని గుర్తు చేశారు.

# తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలోనే వరంగల్ విమానాశ్రయాన్ని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరంగల్‌తోపాటు మరో మూడు.. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమను కోరారన్నారు. అయితే పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం విషయంలో ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక సానుకూలంగా వస్తే.. అనంతరం భూసేకరణకు వెళ్ల వచ్చని ఆయన చెప్పారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మాత్రం రక్షణ శాఖ పరిధిలో ఉందని గుర్తు చేశారు. ఆ శాఖ నుంచి అనుమతి వస్తే.. ఆదిలాబాద్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదీకాక ఆదిలాబాద్‌కు ఓ వైపు చత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్రలు సరిహద్దులు ఉన్నాయన్నారు. దీంతో ఆ దరిదాపుల్లో విమానాశ్రయం లేదని గుర్తు చేశారు. అక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. మరోవైపు వరంగల్ విమానాశ్రయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తూ.. భూసేకరణకు ఇప్పటికే సర్క్యులర్ సైతం జారీ చేసిందని ఆయన వివరించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వరంగల్‌లో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ఢిల్లీ పర్యటన కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ సోమవారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. మంగళవారం ఉదయం కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ మంత్రి కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడంతో.. ఆయనకు ఎదురేగి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆలింగనం చేసుకున్నారు. ఆ తర్వాత తన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను కేంద్ర మంత్రి శాలువాలతో సత్కరించి.. తిరుమల శ్రీవారి ప్రతిమలను వారికి అందజేశారు. అనంతరం వారు..

## గెలిస్తే..సరేసరి..లేకుంటే ట్యాంపరింగా?

### - కెఎ పాల్ పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,నవంబర్26: గెలిస్తే ఇవిఎంలు మంచివి..లేకుంటే చెడ్డవా అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎంలను రద్దుచేసి దేశవ్యాప్తంగా ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ విధానాన్ని తీసుకుని రావాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎం విధానాన్ని రద్దు చేసి తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ విధానాన్నే అనుసరిస్తున్నారని, భారత్ కూడా దాన్నే కొనసాగిస్తే బాగుంటుందని అన్నారు. అంతేకాకుండా.. ఎన్నికల సందర్భంగా దేశంలో రూ.వేల కోట్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు.ఈ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. 'ఇక్కడ ఏం జరుగుతోంది. మీరు గెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేదు అంటారు. ఓడిపోతే మాత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందంటారు. బ్యాలెట్ విధానాన్ని అనుసరించిన మాత్రాన అవినీతి ఆగిపోతుందని మీరు చెప్పగలరా?' అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

# పకడ్బందీగా డాటా ఎంట్రీ

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**(మెదక్ ప్రతినిధి)నవంబర్,26, మెదక్ టుడే న్యూస్:**మెదక్ మండలం ఎంపీడీవో కార్యాలయంలో సర్వే డాటా ఎంట్రీని పరిశీలించారు. ఆపరేటర్లకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సర్వే డాటా ఎంట్రీని పకడ్బందీగా చేయాలని ఏలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. ప్రతి దరఖాస్తును ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని ఎంట్రీ చేయాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ హింస వ్యతిరేకంగాఅంతర్జాతీయ పక్షోత్సవాలు

**వేములవాడ :** స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాలు నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా సమాఖ్య నందు ఏర్పాటు చేసినటువంటి సమావేశం అవగాహన శిబిరం నిర్వహించడం జరిగింది. మహిళా సాధికార సిబ్బంది పాల్గొని మహిళలకి స్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన చట్టాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ గృహ హింస చట్టం 2005, అక్రమ రవాణా నిరోధక చట్టం 1956, ప్రసూతి సౌకర్యాల హక్కుల చట్టం 1961, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిరోధక చట్టం 1994, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012, పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013, బాల్య వివాహాల నిరోధక చట్టం 2006, వరకట్న నిషేధ చట్టం 1961, వివాహాలు తప్పనిసరి నమోదు చట్టం 2002 వంటి అతి ముఖ్యమైన చట్టాల మీద అవగాహన కల్పించడం జరిగింది. అలాగే మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం ఏర్పాటు చేసుకుని 25 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ మహిళలపై హింసలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అందుకే ఈ సంవత్సరం థీమ్ గా " క్షమించద్దు మహిళల పట్ల హింసను నిర్మూలించేందుకు చేతులు కలుపుదాం అనే నినాదంతో లింగ వివక్షత, లింగ సమానత్వం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా మనమందరం కలిసి పోరాడాలని తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్కరు కూడా మహిళలు పై జరిగే హింస గురించి కచ్చితంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో పద్మ అయ్యగారు జిల్లా సమక్ష అధ్యక్షురాలు %శా%.సరిత సఖి కేంద్రం కౌన్సిలర్ అంజలి, సీసీలు, వివో లు పాల్గొనడం జరిగింది

# చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

**వేములవాడ :**వేములవాడ పట్టణంలోని వాణి విద్యాలయం హై స్కూల్ లో మంగళవారం ఈనాడు ప్రతిభ పాటవ పోటీల్లో భాగంగా చిత్రలేఖనం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 8, 9, 10వ తరగతి విద్యార్థులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి కే, శివాని పదవ తరగతి, రెండవ బహుమతి అనుశ్విని ఎనిమిదవ తరగతి, మూడవ బహుమతి శ్రీజ ఎనిమిదో తరగతి విజేతలుగా నిలిచారు. చిత్రలేఖనంలో మొదటి బహుమతి డి, శ్రీ హర్షిని పదవ తరగతి, రెండవ బహుమతి ఏ, స్త్రీనిచి 9వ తరగతి, మూడవ బహుమతి ఎం, శ్రీ నిత్య ఎనిమిదో తరగతి గెలుపొందారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్స్ బద్దం అనంతరెడ్డి, పిల్లి మహేష్ మరియు పాఠశాల ప్రిన్సిపల్ బత్తిని రాము, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు..

# రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**వేములవాడ ,** రాజ్యాంగ దినొత్సవం పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యాంగానికి సంబంధించిన ప్రతిజ్ఞను సిబ్బంది, అధికారులతో జిల్లా కలెక్టర్ చేయించారు. బ్రిటీష్ వారు 200 కు పైగా సంవత్సరాలు భారతదేశాన్ని పాలించిన తరువాత మనకు స్వాతంత్ర్యం లభించిందని, మన రాజ్యాంగం రచించడానికి కమిటి ఎర్పాటు చేసి రెండు సంవత్సరాల పాటు చర్చించి 1949 నవంబర్ 26,న తుది



రాజ్యాంగం ఆమోదించబడిందని తెలిపారు.ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారతదేశానికి గొప్ప రాజ్యాంగం ను అందించారని 2015 సంవత్సరం నుంచి రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని, దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పలువురు విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేశారని,2సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగంరూపొందిందనీ పేర్కొన్నారు. సి.పి.ఓ. శ్రీనివాసా చారి, డి.పి.ఆర్.ఓ.వి.శ్రీధర్, ఉపాది కల్పనాధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, కలెక్టరేట్ ఏ.ఓ.రామ్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జావేద్ అహ్మద్, శ్రీకాంత్, పుష్పాలత, షరీఫ్, వేణు, ప్రవీణ్, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి





**కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే డబ్బులు పడేందుకు ఏర్పాటు చేయాలి.**
**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి.**

**(మెదక్ ప్రతినిధి)నవంబర్,26, మెదక్ టుడే న్యూస్:**మంగళ వారంరాష్ట్ర ముఖ్యమంత్రిఎనుముల రేవంత్ రెడ్డి,పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి న్యూఢిల్లీ నుండి రాష్ట్రంలోని మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు,సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కేంద్రాలలో గన్ని సంచులు, ప్యాడి క్లీనర్స్, అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి రైతులకు వెంటవెంటనే డబ్బులు పడే విధంగా సంబంధిత జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు, సన్న రకం కు బోనస్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు. మహబూబ్ నగర్ రైతు సదస్సు లోపు రైతులందరికీ వారి వారి ఖాతాలలో ధాన్యం కొనుగోలు డబ్బులు పడేలా ఆర్థిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్లో ఆన్లైన్ ద్వారా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, పౌరసరఫరాల కమిషనర్ చౌహన్, తదితరులు పాల్గొని ధాన్యం కొనుగోళ్లపై సూచనలు జారీ చేశారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నడుస్తుందని ప్రస్తుతం 1,75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు చేసి కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ ఉన్నదని సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని కొనుగోలు ఎలాంటి అవాంతరాలు జరగకుండా ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం జరిగిందని తెలిపారు గత వారం రోజుల నుండి ప్రతిరోజు 8,000 మెట్రిక్ టన్నుల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు జరుగుతుందని ప్రస్తుతం 93 మిల్లులు టాకింగ్ చేయడం జరిగిందని బ్యాంక్ గ్యారంటీ కూడా ఇవ్వడానికి ముందుకు వచ్చారని , కొనుగోలు ఎటువంటి సమస్యలు లేవని, సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాలను పాటిస్తూ మన జిల్లాలో అంచనాలకు అనుగుణంగా ధాన్యాన్ని నిలువ చేసుకుని అదనంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మా జిల్లా నుండి ఇతర జిల్లాలకు కూడా రవాణా చేస్తున్నామని, మిల్లర్స్ దగ్గర లారీలు వెయిటింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అన్లోడింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు, పటిష్ట పర్యవేక్షణకు రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి ఒకరిని నియమించుకొని లారీ అన్లోడింగ్ కి ఎంత టైం పడుతుంది మిల్లర్స్ ఏమైనా సమస్యలు సృష్టిస్తున్నారా రైతులు మిల్లర్స్ వల్ల ఏమైనా ఇబ్బంది ఎదుర్కొంటున్నారా అనే విషయాలను పరిశీలిస్తున్నామన్నారు .సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ధాన్యం కొనుగోలు పై చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకొని రైతుల పేమెంట్ విషయంలో కూడా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ నుండి అదనపు కలెక్టర్ నగేష్ ,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు,డిపిఓ యాదయ్య, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి బద్రీనాథ్ , జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ఇతర శాఖల అధికారులు కలిసి పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య దినోత్సవం ప్రజాస్వామ్యం పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.కలెక్టర్

**ప్రజలు దేశ ఫలాలను పూర్తిస్థాయిలో పొందాలంటే బాల్యం నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలి.**
**అత్యంత పారదర్శకంగా ప్రభుత్వ,ఫలాలు ప్రజలకు అందించే విధంగా. అధికారులు విశేష కృషి చేయాలి.**
**కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా భారత రాజ్యాంగం దినోత్సవం.**
**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**





**(మెదక్ ప్రతినిధి)నవంబర్,26, మెదక్ టుడే న్యూస్:**ప్రజాస్వామ్య దినోత్సవం ప్రజాస్వామ్యం పట్ల అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారంకలెక్టర్ కార్యాలయ సమావేశ హాలులో భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ,బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం 1949, నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రచించారని, రాజ్యాంగ రచనలో డా. బీఆర్ అంబేద్కర్ ప్రధాన భూమిక పోషించారన్నారు. నేడు భారత రాజ్యాంగం ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం మనకు ఎంతో గర్వ కారణమన్నారు. మన అందరికి ఎంతో ప్రత్యేకమైన రోజన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో మండల కార్యాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో, నిర్వహిస్తున్నామని చెప్పారు. దేశం లో కుల, మత, భాష, లింగ, ప్రాంత, జాతి మొదలైన తారతమ్యాలు లేకుండా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించేం దుకు రాజ్యాంగం. ఓ కరదీపికలా పనిచే స్తోంది. అని చెప్పారు. రాజ్యాంగం లోని ప్రజాస్వామిక వ్యవస్థలను వినియోగించుకుంటూ సామాజిక, ఆర్థిక విప్లవం ద్వారా నూతన సమానత్వం సాధ్యపడుతుందన్నారు. దేశం లోని అన్ని మతా తెగలు, ఆదివాసీ, దళితా అణగారిన, పీడిత వర్గాల ప్రజలకు ం ా జ ా ్య ం గ ్ ం రక్షణపనిచేస్తుందన్నారు. దేశం లోని అన్ని మతాలు, తెగలు, ఆదివాసీ, దళితులు, అణగారిన, పీడిత వర్గాల ప్రజలకు రాజ్యాంగం రక్షణగా నిలవాలని దాని సృష్టికర్తలు ఆకాంక్షించారని చెప్పారు.. వారి కలలను నిజం చేస్తూ బడుగు బలహీన అణగారిన వర్గాలు, మహిళలు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. ఈక్రమంలో ఆ విలువల పట్ల పౌరుల్లో గౌరవ భావాన్ని పెంపొందించేందుకు ఏటా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అని చెప్పారు. ప్రజలు దేశ ఫలాలను పూర్తిస్థాయిలో పొందాలంటే.. బాల్యం నుంచే రాజ్యాంగ పాఠాలు బోధించాలి. ప్రజలంతా ఒకటే అనే భావన వారి మనసుల్లో నాటేందుకు, సామాజిక, ఆర్థిక అంతరాలు చెరిపేసి సమతాభావం పెంపొందిం చేందుకు ఆ విలువలు అత్యావశ్యం. మౌలిక లక్ష్య సాధన కోసం పీఠికను ప్రతిరోజు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అనంతరం అధికారులు సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, సంబంధిత వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి





**ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించం.**
**ప్రభుత్వ పాఠశాల,కళాశాలలో విద్యార్థుకు,ప్రభుత్వ హాస్పిటల్లలో రోగులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలి.**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.**



**(మెదక్ ప్రతినిధి)నవంబర్,26, మెదక్ టుడే న్యూస్:** కొల్చారం మండలం పోతన శెట్టిపల్లి గ్రామంలోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్ మరియు కేజీవీబీ పాఠశాలలో వంటగదిని ,వంటలను వండే వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి,రైతులకు సత్వరమే వారి అకౌ%శీ%ట్లలో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలని ఆదేశించారు. ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమన్నారు. ధాన్యం లోడింగ్ అన్లోడింగ్ లో ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు. పౌష్టిక ఆహారాన్ని అందించాలిప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మంచి నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటు పట్లు లేకుండా చూడాలన్నారు.
వంట గది,వంట సామగ్రిని ఎపుడు శుభ్రంగా ఉంచాలని,కేజీవీబీ పాఠశాల సిబ్బందికి సుంచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ది ఐస్ బాక్స్ మర్డర్స్.. నేటికీ మిస్టరీగానే!

ఉన్మాద చర్యలు ఎప్పుడూ ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేస్తాయి. నిర్ఘాంతపోయే నిజాలతో గజగజా వణికిస్తాయి. నెత్తుటిధారలతో చరిత్ర పేజీలను తడిపేస్తాయి. ఆ జాబితాలోనివే అమెరికాలోనే అతి భయంకరమైన ఐస్ బాక్స్ మర్డర్స్. సుమారు 56 ఏళ్లు దాటినా నేటికీ తేలని ఆ కథేంటో ఈ వారం మిస్టరీలో చూద్దాం. 1965, జూన్ 23.. చార్ల్స్ ఫ్రెడరిక్ రోజర్స్ అనే పేరు అమెరికా మొత్తం మారుమోగిన రోజు. అతడి ఫొటోలు నాటి పత్రికల మొదటి పేజీల్లో పడ్డాయి. మోస్ట్ పాపులర్‌గా కాదు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా. అసలు ఎవరీ రోజర్స్.. అతడు చేసిన నేరమేంటీ?ఫ్రెడ్ క్రిస్టోఫర్, మరియా ఎడ్వినా.. దంపతులకు 1921 డిసెంబర్ 30న జన్మించాడు రోజర్స్. 1942 నాటికి హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పొందాడు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యునైటెడ్ స్టేట్స్ నేవీలో పైలట్‌గా ఉంటూనే.. నేవల్ ఇంటెలిజెన్స్ కార్యాలయంలో గుఢచారిగానూ పనిచేశాడు. యుద్ధం తర్వాత తొమ్మిదేళ్ల పాటు షెల్ ఆయిల్‌కు భూకంప శాస్త్రవేత్త గా సేవలందించాడు. 1957లో ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఆ ఉద్యోగాన్ని వదిలేశాడు. 'రోజర్స్ ఏడు భాషలను అనర్గళంగా మాట్లాగలడు. చాలా తెలివైనవాడు. చమురు, బంగారం వెలికి తియ్యడంలో ప్రత్యేకమైన ప్రతిభ ఉంది అతడికి' అనేది అతడి సన్నిహితుల మాట. 1963 తర్వాత రోజర్స్ నిరుద్యోగిగానే ఉన్నాడు. హ్యూస్టన్ లోని మాంట్రోస్ పరిసరాల్లో నివసిస్తున్న వృద్ధ తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. అయితే తెల్లవారకముందే వెళ్లి.. అర్ధరాత్రికి తిరిగి వచ్చే రోజర్స్ అక్కడే ఉంటున్నాడనే విషయం చుట్టుపక్కల వాళ్లక్కూడా పెద్దగా తెలియదు.

ఏళ్లు గడిచాయి.. : 1965, జూన్ 23న ఫ్రెడ్ మేనల్లుడు మార్విన్.. ఆందోళనగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు. గత కొన్ని రోజులుగా తన అత్తా, మామ(ఫ్రెడ్, మరియా)ల నుంచి ఎలాంటి సమాచారం లేదని, ఫోన్ చేస్తే ఎత్తడం లేదని, ఇంటికి వెళ్తే తాళాలు వేసి ఉన్నాయని.. అసలే ముసలివాళ్లు.. ఏదైనా ప్రమాదంలో ఉన్నారేమోనని అనుమానంగా ఉందని, తక్షణమే వెతకాలని కోరాడు.దాంతో హ్యూస్టన్ పోలీసులు రంగంలోని దిగారు. మార్విన్‌ని తీసుకుని మాంట్రోస్ పరిసరాల్లో ఉన్న ఫ్రెడ్ ఇంటికి బయలుదేరారు సోదా చెయ్యడానికి. తలుపుమూసి ఉండటం చూసి.. బలవంతంగా తెరిచారు. తలుపు తీస్తే లోపలంతా సాధారణంగా ఉంది. ఎక్కడా ఏ అలికిడీ లేదు.



డైనింగ్ టేబుల్ మీద ఏవో వంటకాలు కనిపించాయి. చుట్టూ చూశారు పోలీసులు. ఒక్కొక్కరూ ఒక్కో గది వెతికారు. ఎక్కడా ఏమీ అసాధరణమైనవి కంటపడలేదు.మనుషులూ కనిపించలేదు. అందులో ఒక పోలీస్ ఆఫీసర్‌కి ఓ అనుమానం వచ్చింది. 'ఈ ఇంట్లో ఎన్నిరోజులుగా మనుషులు ఉండటం లేదు? రోజువారి అసవరాల కోసం ఏమైనా తెచ్చి పెట్టుకుంటున్నారా లేదా?' అనుకుంటూ ఫ్రిజ్ ఓపెన్ చేసి చూశాడు. ఫ్రిజ్ నిండా శుభ్రంగా కడిగిపెట్టిన మాంసం కనిపించింది. అడివి దున్న మాంసం కాబోలు అనుకుని తలుపు వెయ్యబోతుంటే.. కింద ఉండే ట్రాన్స్‌పరెంట్ కూరగాయల టబ్‌లో రెండు మనిషి తలలు కనిపించాయి. అవి ఎవరివో కాదు.. ఫ్రెడ్, మరియాలవే.

ఫ్రిజ్ డోర్ తీసిన ఆఫీసర్ నుంచి ఒక గావుకేక వినిపించింది. మిగిలిన వాళ్లు అతడి దగ్గరకు పరుగుతీశారు. అక్కడ పరిస్థితి చూసి గజగజా వణికారు. టాయిలెట్ ఫ్లష్ దగ్గర.. ఆ దంపతుల అవయవాలు తొలగించినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. అవశేషాలు దొరికాయి. రోజర్స్ గదిలో రక్తంతో తడిసిన రంపాన్ని బయటికి తీశారు. అయితే ఆ రోజు నుంచి రోజర్స్ కనిపించలేదు. అసలు ఎక్కడున్నాడో ఈ ప్రపంచానికి తెలియలేదు. నేరం చేసింది ఎవరు? కన్నకొడుకే తల్లిదండ్రులను ఇంత కిరాతకంగా కడతేర్చాడా? అనే వార్తలు యావత్ అమెరికా వ్యాపించాయి. అంతకు రెండు రోజుల ముందే ఫ్రెడ్ దంపతులు హత్యకు గురైనట్లు రిపోర్ట్‌లు వచ్చాయి. రెండు రోజుల ముందంటే జూన్ 20న ఈ ఘోరం జరిగింది. అంటే ఆ రోజు ఫాదర్స్ డే కావడంతో ఈ వార్త మరింత సంచలనం అయ్యింది.శవపరీక్షల్లో ఫ్రెడ్(81), మారియా(72)లని తలపై సుత్తితో కొట్టి చంపినట్లు తేలింది. చనిపోయిన తర్వాతే ఫ్రెడ్ కాళ్లు, జననాంగాలు తొలగించారని, మారియా శరీరానికి నిప్పు పెట్టి, మిగిలింది ఫ్రిజ్‌లో దాచిపెట్టారని వెల్లడైంది. అయితే రోజర్స్.. సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజన్సీ(సి.ఐ.ఏ)కి సంబంధించిన ఏజెంట్ అని.. మెక్సికో నగరంలో 'లీ హార్వే ఓస్వాల్డ్'గా చలామణీ అయ్యాడని.. చార్ల్స్ హారెల్సన్, ప్రెసిడెంట్ జాన్ ఎఫ్. కెన్నెడీల హత్యల్లో నిందితుడని, అతడి రహస్యాలు తెలుసుకున్నందుకే తల్లిదండ్రులను చంపేశాడని.. కథలు కథలుగా రాశారు కొందరు ఔత్సాహిక రచయితలు. అయితే ఈ వాదనను పలువురు విచారణాధికారులు కొట్టిపారేశారు.రోజర్స్ కోసం గాలింపు చర్యలు ఎంత ముమ్మరం చేసినా ఫలితం లేకపోయింది. చివరికి 1975లో ఈ కేసు విచారిస్తున్న న్యాయమూర్తి.. చట్టప్రకారం రోజర్స్ చనిపోయాడని ప్రకటించడంతో ఈ కేసు అధికారికంగా ముగిసింది. కోల్డ్ కేసుల సరసన చేరిపోయింది. ఫోరెన్సిక్ అకౌంటెంట్ హ్యూస్టన్, అతడి భార్య మార్తా ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడించారు. రోజర్స్ తల్లిదండ్రులను హత్య చేసిన తరవాత తను కూడా హొండురాస్ అనే ప్రాంతంలో హత్యకు గురయ్యాడని, సీ.ఐ.ఏ సిబ్బందితో అతడికి సన్నిహిత సంబంధాలు ఉండేవని నిర్ధారించారు. మరోవైపు ఫ్రెడ్ దగ్గర పని చేసే తోటమాలి మాటల ప్రకారం.. రోజర్స్ ఎప్పుడూ తల్లిదండ్రులను ఏడిపిస్తూనే ఉండేవాడని, దుర్భాషలాడి బాధపెట్టేవాడని.. జూదం, దొంగతనం అంటూ చట్టవిరుద్ధమైన పనులకు తెగబడేవాడని, చాలా సార్లు ఫ్రెడ్ దగ్గర డబ్బులు దొంగలించాడని చెప్పాడు. అంతేకాదు రోజర్స్ ముందే ప్లాన్ చేసుకుని తల్లిదండ్రుల్ని చంపి ఉంటాడని, ఎవరో నమ్మకమైన స్నేహితుల సాయంతోనే దొరక్కుండా తప్పించుకోగలిగాడని, చివరికి హొండురాస్‌లో మైనర్ల వేతనాల వివాదంలో హత్యకు గురయ్యి ఉంటాడని అభిప్రాయపడ్డాడు. ఇదే కథనాన్ని బేస్ చేసుకుని 'ది ఐస్ బాక్స్ మర్డర్స్' అనే పుస్తకం కూడా వచ్చింది. అయితే అన్ని అనుమానాలు, అంచనాలే కానీ అసలు ఏం జరిగిందో చెప్పేవాళ్లు లేకపోవడంతో ఈ కేసు నేటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.

## పసిబిడ్డకు సీసాతో పాలు పడుతున్నారా?

సాధ్యమైనంత వరకు బిడ్డకు తల్లిపాలే పట్టాలి. నిజానికి అవే చాలా మంచివి. అయితే తల్లికి పాలు పడని సందర్భాల్లో మాత్రం పోత పాలు ఇవ్వవచ్చు. ఇవి రెండు రకాలుగా ఉంటాయి.

పాడి పశువుల పాలు : ఆవు, గేదె, మేక వంటి పాడి పశువుల పాలు ఇవ్వవచ్చు.

డబ్బా పాలు : పిల్లల కోసం ఉద్దేశించి అమ్మే పాల పౌడర్‌ను ఉపయోగించి కలిసి ఇచ్చేవి. పాడి పశువుల పాలైనా లేదా డబ్బాపాలైనా సీసా సహాయంతో ఇస్తారు. ఇలా సీసాతో పాలు పట్టాల్సివచ్చినప్పుడు పాటించాల్సిన కొన్ని జాగ్రత్తలివి...

ముందుగా సీసాను, పాల పీకను సబ్బు నీళ్లతో శుభ్రంగా కడగాలి.

పాల సీసాను పదినిమిషాల పాటు మరిగే నీళ్లలో ఉంచాలి. అలాగే పాల పీకను కనీసం రెండు నిమిషాల పాటు వెడి నీళ్లలో మరగనివ్వాలి.

బిడ్డకు పాలు పట్టే సమయంలో సరైన విధంగా పట్టాలి.

అంటే బిడ్డను ఒళ్లో పడుకోబెట్టి పాలు ఇవ్వాలి. అలాగే.. పాలు పట్టాక బిడ్డను వెంటనే పడుకోబెట్టకూడదు.

పాలు పట్టగానే బిడ్డను మొదట భుజంపై వేసుకుని నెమ్మదిగా తట్టాలి. ఇలా తేన్పు వచ్చే వరకు తట్టాలి.

సీసాలో పాలు తాగించే సమయంలో ఒకసారి తాగాక మిగిలిన పాలను తప్పక పారబోయాలి.

బిడ్డ నిద్రపోయే సమయంలో పాలు తాగించకూడదు.

## ఇదే అతి పె..ద్ద.. గోల్డ్ మైనింగ్!
## ఏటా లక్షల కిలోల బంగారం తవ్వుతారట..

నెవాడా గోల్డ్ మైనింగ్: బంగారానికి పసిడి, సువర్ణం, సురభి, కాంచనం, హిరణ్యం.. వంటి అనేక పేర్లున్నాయి. ఏ పేరుతో పిలిచినా పుత్తడి లోహం మాత్రం చాలా విలువైనది. అంత విలువైన బంగారంతో తయారుచేసిన కనకాభరణాలంటే మోజు పడనివారంటూ ఉండరేమో! బంగారం ఆకర్షణీయంగా ఉండటమేకాకుండా విలువకూడా అదే స్థాయిలో ఉం టుంది. ఇక మనదేశంలో ఐతే బంగారాన్నిఏకంగా ఆస్తిగా భావి స్తారు. ఇంత విలువైన బంగారం గనుల నుంచి లభ్యమౌతుందనే విషయం అందరికీ తెలిసిందే. ఐతే ప్రపంచంలోనే అత్యధికం బంగారం ఏక్కడ లభ్యమౌతుంది? అక్కడ ఎంత బంగారం వెలికితీస్తున్నారో? దాని విలువ ఎంతుంటుందో?.. ఎప్పుడైనా ఆలోచించారా! ఆ విశేషాలు మీ కోసం..



అతిపెద్ద గోల్డ్ మైన్.. ప్రపంచదేశాలకు ఎగుమతి..ప్రపంచవ్యాప్తంగా ఎన్నో గనుల నుంచి బంగారం లభ్యమవుతున్నా.. అత్యధిక బంగారాన్ని మాత్రం నెవాడా బంగారం గని నుంచే లభ్యమవుతుంది. ఎందుకంటే ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్ మైన్. అమెరికాలోని నెవాడా సిటీలో ఈ బంగారం గని ఉంది. ఈ బంగారం గని సంవత్సరానికి లక్షల కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేస్తుంది. ప్రపంచంలోని అన్ని దేశాలకు ఇక్కడి నుంచి బంగారం ఎగుమతి అవుతుంది. అంటే ఈ బంగారం గని ద్వారా ఏటా ఎన్ని కోట్ల రూపాయల ఆదాయం వస్తుందో అంచనా వేయండి.ఇప్పటివరకు ఎంత బంగారం తవ్వారంటే..వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ డేటా ఆధారంగా 'స్టాటిస్టా' రూపొందించిన జాబితా ప్రకారం నెవాడా బంగారం గని నుంచి ప్రతీ ఏట 1 లక్ష 70 వేల కిలోల వరకు బంగారం తవ్వబడుతుంది. దాదాపుగా ఆరు వందల కోట్ల రూపాయల విలువైన బంగారం ఎగుమతి అవుతుందట. 1835 నుండి 2017 వరకు నెవాడా దాదాపుగా 20,59,31,000 ట్రాయ్ ఔన్సుల బంగారాన్ని ఉత్పత్తి చేసిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇంకో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. మొత్తం ప్రపంచ జనాభాలో 5 శాతం ఇక్కడే ఉన్నారని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ఏదిఏమైనా పసుపు రంగులో మెరిసిపోయే బంగారం చూడటానికే కాదు... దాని విశేషాలు వినడానికి కూడా చాలా గమ్మత్తుగా ఉ?న్నాయి కదా!!



# పత్తిలో లాభదాయకంగా అంతర పంటల సాగు

**3 ఎకరాల్లో పత్తి సాళ్ల మధ్య కంది, పెసర, వేరుశనగ, మిరప, ఉల్లితో పాటు కూరగాయల ప్రకృతి సాగు**

**30 క్వింటాళ్ల పత్తితోపాటు 4 క్వింటాళ్ల పెసలు, 4 క్వింటాళ్ల కందులు, 1 క్వింటా వేరుశనగ, కూరగాయల దిగుబడి**

**మూడెకరాలకు పెట్టుబడి రూ. 50 వేలు, నికరాదాయం రూ. 2.6 లక్షలు సన్నకారు రైతు మహేశ్వరరెడ్డి విజయగాథ**

తోటి రైతులు రసాయనాలు వాడి కేవలం పత్తిని ఎకరానికి 8 క్వింటాళ్లు పండిస్తుంటే.. వీరంరెడ్డి మహేశ్వరరెడ్డి (43) అనే రైతు ప్రకృతి వ్యవసాయంలో 10 క్వింటాళ్ల పత్తితో పాటు అదనంగా కూరగాయలు, పప్పుధాన్యాలను సాగు చేస్తూ అధిక దిగుబడి, అధిక నికరాదాయం పొందటంతోపాటు తెలివిగా భూసారాన్ని కూడా పెంచుకుంటున్నారు. కర్నూలు జిల్లా గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన ఆయన పదో తరగతి తర్వాత వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టారు. తమ మూడెకరాల వర్షాధార రేగడి భూమిలో రసాయనిక వ్యవసాయానికి స్వస్తి చెప్పి, ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ విశేషంగా రాణిస్తున్నారు. మహేశ్వరరెడ్డి పొలం ప్రకృతి వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంగా మారిపోయింది. తరచూ 'పొలంబడి' నిర్వహిస్తున్నారు. మొదట ఏడాది ఒక ఎకరంలో పత్తితోపాటు జొన్న, శనగ అంతర పంటలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశారు. ఈ ఏడాది 3 ఎకరాల భూమిలో 8 బీటీ పత్తి సాళ్లకు 1 కంది సాలు వేశారు. సాళ్ల మధ్య 3.5 అడుగుల దూరం ఉంటుంది. అంతర పంటలుగా వేరుశనగ, కంది,పెసర, మిరప, ఉల్లి, సొర. బీర, బెండ. గోంగూరు, పాలకూర, చుక్కకూర సాగు చేశారు. పెంచుకుంటున్న నాటు ఆవు పేడ, మూత్రంతో ద్రవ, ఘన జీవామృతాలను, కషాయాలను తయారు చేసుకొని వాడుతున్నారు. పత్తి ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా పత్తి రూ. 8 వేలకు గ్రామంలోనే అమ్ముతున్నారు. పత్తి ద్వారా రూ. 2.40 లక్షల వరకు ఆదాయం వస్తోంది. 4 క్వింటాళ్ల పెసర దిగుబడి వచ్చింది. క్వింటా రూ. 8 వేల చొప్పున రూ. 32 వేలకు అమ్మారు. కంది కాపును బట్టి నాలుగు క్వింటాళ్ల కందులు అవుతాయని, రూ. 25 వేల వరకు ఆదాయం రావచ్చని రైతు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ, మిరప కాయలు, కూరగాయలు, ఆకుకూరల ద్వారా మరో రూ.10 వేల వరకు ఆదాయం వచ్చింది. మహేశ్వరరెడ్డితో పాటు తల్లి, భార్య కూడా రోజూ పని చేస్తారు. పత్తి తీతకు తప్ప కూలీలను పిలవరు. మూడు ఎకరాలకు కలిపి రూ. 50 వేల వరకు పెట్టుబడి అయ్యింది. రూ. 3.10 లక్షల ఆదాయంలో రూ. 2.60 లక్షల నికరాదాయం పొందటం విశేషం. సాధారణంగా పత్తి పంట పూర్తి అయిన తర్వాత కట్టెను కాల్చివేస్తారు. మహేశ్వరరెడ్డి ట్రాక్టర్‌కు అమర్చిన యంత్రం ద్వారా పత్తి కట్టెను 2 అంగుళాల ముక్కలుగా చేసి నేలపై ఆచ్ఛాదనగా వేస్తున్నారు. ఆ తర్వాత దుక్కి చేసినప్పుడు అవి భూమిలో కలిసి కుళ్లి పొలానికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతున్నాయి. ప్రతి ఏటా ఎకరాకు 400 కిలోల ఘన జీవామృతం వినియోగిస్తారు. 15 రోజులకోసారి ఎకరానికి 500 లీటర్ల ద్రవ జీవామృతం పోస్తున్నారు. పత్తి కట్టె, ఘన, ద్రవ జీవామృతాలే భూమిని సారవంతం చేస్తూ సిరులు కురిపిస్తున్నాయని మహేశ్వరరెడ్డి సంతోషంగా చెబుతున్నారు. పంటలకు చీడపీడలు, పురుగుల బెడదను తగ్గించుకునేందుకు ఖర్చు లేని సమగ్ర సస్య రక్షణ మార్గాలు అనుసరిస్తుండటం విశేషం. పసుపు, తెలుపు, నీలం జిగురు అట్టలు ఎకరాకు 10–15 వరకు వినియోగిస్తున్నారు. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేశారు. పంగల కర్రలు పాతడం వల్ల వాటిపై పక్షులు వాలి పురుగులను తినేస్తున్నాయి. పొలం చుట్టూ మూడు వరుసలు ఎర పంటగా జొన్న వేశారు. అప్పుడప్పుడూ వేప గింజల కషాయలు, నీమాస్త్రం ఉపయోగిస్తుండటం వల్ల చీడపీడల బెడద లేకుండా పోయింది. పత్తి వంటి వాణిజ్య పంటను సైతం తక్కువ ఖర్చుతో సాగు చేస్తూ స్థిరంగా నికరాదాయం పెంచుకోవచ్చని నిరూపిస్తున్న మహేశ్వరరెడ్డి ఆదర్శ ప్రాయుడు. – జి.శ్రీనివాసులు, కర్నూలు (అగ్రికల్చర్)



**దిగుబడితోపాటు నికరాదాయమూ ఎక్కువే!**

ప్రకృతి వ్యవసాయం మొదటి రెండేళ్లు దిగుబడి అంతంత మాత్రంగానే ఉన్నా తర్వాత మెరుగైంది. పత్తిలో అంతర పంటలు చాలా రకాలు వేస్తున్నాం. కుటుంబం అంతా పని చేస్తాం. కూరగాయలు, పప్పులు కూడా పండించుకొని తింటున్నాం. గత ఏడాది కాలం కలసి వచ్చి ఎకరానికి 14 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావటంతో జూలైలో విత్తటం వల్ల పత్తి ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే, ఈ ఏడాది పత్తి ధర బాగుండటం వల్ల ఆదాయం బాగుంది.కెమికల్ వాడనందున పెసరకు మంచి రేటు వచ్చింది. మూడెకరాలకు రూ. 2.60 లక్షల వరకు నికరాదాయం వచ్చింది. భూసారం పెరిగింది. మట్టి మెత్తబడింది. కొద్ది పాటి వర్షం పడినా చాలా రోజుల పాటు బెట్టకు రాకుండా తేమ నిలుస్తోంది. రసాయనాలు వాడే మిగతా రైతులు ఒక్క పత్తి పంటే వేస్తారు. వారికి ఖర్చు నా కన్నా రూ.5–6 వేలు ఎక్కువే అయ్యింది. ఎకరాకు 8 క్వింటాళ్ల పత్తి పండింది. ప్రకృతి వ్యవసాయం నా కుటుంబానికి ఎంతో సంతోషాన్నిస్తోంది. వి.మహేశ్వరరెడ్డి (99488 43247), పెంచికలపాడు, గూడూరు మం., కర్నూలు జిల్లా

**ఎఫ్.పి.ఓ.ల ఆదాయ మార్గాలపై ఆన్‌లైన్ శిక్షణ**

రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్.పి.ఓ.ల) పుస్తక నిర్వహణ, ఆదాయ మార్గాలపై ఎఫ్.పి.ఓ.ల నిర్వాహకులకు సికింద్రాబాద్‌కు చెందిన వాటర్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. 2022 జనవరి 28, 29 తేదీల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న ఈ శిక్షణ పొందగోరే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఫీజు, తదితర వివరాలకు.. ఫోన్: 93988 81341, వాట్సప్: 99124 22572.

**18న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ**

పుట్టగొడుగుల పెంపకంపై ఈ నెల 18 (శనివారం) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట దగ్గర గల నాగరత్నం నాయుడు వ్యవసాయ క్షేత్రంలో రైతునేస్తం ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. రాజమండ్రికి చెందిన ప్రముఖ పుట్టగొడుగుల రైతు కొప్పుల శ్రీలక్ష్మి శిక్షణ ఇస్తారు. ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. ఫీజు, రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు 98493 12629, 70939 73999.

## చీమల రక్తం అందుకే ఎర్రగా ఉండదట..!

చురుక్ మని కుట్టి పుసుక్కున జారుకునే చీమలను... ఒక్కోసారి దొరకపుచ్చుకుని కసితీర నలిపి అవతలేస్తాం కూడా!! కానీ మనుషుల రక్తం తాగే చీమల్లో కూడా రక్తం ఉంటుందా? ఒకవేళ ఉంటే ఏ రంగులో ఉంటుంది? ఇలాంటి అనుమానాలు ఎప్పుడైనా వచ్చాయా? మీ ప్రశ్నలకు సమాధానాలు ఇవిగో..చీమల్లో రక్తం ఉంటుంది. ఐతే అది ఎరుపు రంగులోకాకుండా పసుపు పచ్చరంగులో ఉంటుంది. దీనిని హేమోలింఫ్ అని అంటారు. మిడతలు, నత్తల వంటి వర్టిబ్రేట్స్ (వెన్నెముక ఉండే జంతువులు – సకశేరుకాలు)లో ఈ విధమైన రక్తం ఉంటుంది. ఈ ద్రవంలో ఎర్ర రక్తకణాలు లేకపోవటం వల్ల తెల్లగా కనిపిస్తుంది. చీమలు వంటి ఇతర కీటకాల్లో అమైనో యాసిడ్స్ అధికంగా ఉండటమే అందుకు కారణమట.వీటి రక్త ప్రసరణ వ్యవస్థ కూడా భిన్నంగా ఉంటుంది. మనుషుల్లో రక్తం సిరలు, ధమనుల్లో ప్రవహిస్తుంది. ఐతే కీటకాల్లో మాత్రం ధమనులు ఉండవు కానీ శరీరమంతా స్వేచ్ఛగా ఏ దిశలోనైనా రక్తం ప్రవహిస్తుంది. అందువల్లనే చీమలు ఎటువంటి వాతావరణంలోనైనా సులభంగా జీవించగలవు. ఎర్ర రక్త కణాల్లో హిమోగ్లోబిన్ ఉన్నట్లే, హిమోలింఫ్ లోపల హిమోసైనిన్ ఉంటుంది.రక్తం – హిమోలింఫ్ మధ్య గుమనించదగిన ముఖ్యమైన వ్యత్యాసం ఏమిటంటే.. మనుషుల్లోనైతే రక్తం ద్వారా ఆక్సిజన్ శరీరం అంతటా వ్యాపిస్తుంది. కీటకాల్లో ఉండే హేమోలింఫ్ ఆక్సిజన్‌ను శరీరం అంతటా వ్యాపింపచేయదు. వీటి శరీరాలకు స్పిరాకిల్స్ అని పిలువబడే చిన్న చిన్న రంధ్రాల ద్వారా శ్వాస తీసుకుంటాయి. ఈ రంధ్రాలు ఎర్ర రక్త కణాలతో పనిలేకుండా నేరుగా క్రిమి అవయవాలకు ఆక్సిజన్ చేరవేస్తుంటాయి.



## తక్కువ ప్యాకేజీ.. జమ్మూ కశ్మీర్ వెళ్లొస్తారా..?

**హైదరాబాద్:** పర్యాటకులకు స్వర్గధామమైన జమ్మూ కశ్మీర్ తిరిగి ద్వారాలు తెరుచుకుందని, కోవిడ్ అనంతరం అన్ని పర్యాటకుల ప్యాకేజీలను పునరుద్ధరించినట్లు జమ్మూ కశ్మీర్ పర్యాటక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అన్సులల్ హఖ్ చిస్తి తెలిపారు. పర్యాటక రంగంపై ఆధారపడిన జమ్మూ కశ్మీర్ 95 శాతం కోవిడ్ వ్యాక్సినేషన్ పూర్తయిందని, కోవిడ్ అనంతరం పునరుద్ధరించిన ప్యాకేజీల్లో ఇప్పటి వరకు పర్యాటకులు సందర్శించలేకపోయిన అనేక ప్రాంతాలు ఉన్నాయని ఆయన తెలిపారు. నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజౌరి, జమ్మూ టూరిజం డెవలప్‌మెంట్ అథారిటీ సీఈవో వివేక్ పూరీతో కలిసి పాల్గొన్నారు.రానున్న మూడు నెలల్లో 75 వేడుకలను జమ్మూ కశ్మీర్‌లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పర్యాటకులకు భద్రత, రక్షణ ఉంటుందని, భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా పర్యటించవచ్చని చెప్పారు. తెలుగు సినిమా షూటింగ్‌ల కోసం జమ్మూ, కశ్మీర్, లేహ్, లద్దాక్ తదితర ప్రాంతాల్లో అద్భుతమైన పర్యాటక స్థలాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం తగ్గింపు ధరలతో ప్యాకేజీలను అందజేస్తోందన్నారు. సాజిద్ కిర్మాని, వాల్మీకి హరికృష్ణ పాల్గొన్నారు.



printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll, 9948265095-9494117870..Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, medaktoday89@gmail.com 9948265095..